ఏళ్ల తరబడి
మనసులోనే దాచుకున్న
అతని ప్రేమ
ఊహించని విధంగా
ఎలా ఫలించింది?

# ప్రియబాంధవి

జి. రంగబాబు
కథ

కారు హారన్ విని పరుగెత్తుకుంటూ వచ్చాడు శాయన్న. గేటు తీయగానే పోర్టికోలోనికి నేరుగా పోనిచ్చాను కారును.

కారుదిగి ఇంట్లోకి దారితీసి వైట్ కోటు, స్టెతస్కోపు కుర్చీలో గిరాటేసి సోఫాలో కూర్చుని వెనక్కివాలి కళ్లు మూసుకున్నాను అలసటగా.

ఈరోజు బాగా అలసిపోయినట్లనిపించిందెందుకో.

అవును! ఈ డాక్టరు వృత్తే అలాంటిది. క్షణం తీరిక వుండదు. రోగులూ, వారి సమస్యలతో పగలంతా హాస్పిటల్లో ఒకటే బిజీ. రకరకాల రోగులున్నవారు వస్తారు. వారిని రిసీవ్‌చేసుకుని వారు చెప్పేదాన్ని ఓపిగ్గా వినాలి. తగిన మందులు రాసివ్వాలి. జబ్బు తగ్గకపోతే ట్రీట్‌మెంట్ మార్చాలి. ఒక రకంగా ఈ వృత్తి కత్తిమీద సాములాంటిదే.

వృత్తిపట్లమాత్రం తానెంతో సిన్సియర్ అంటుంటారందరూ. అదే తనకు కావలసినంత తృప్తినిస్తోంది.

ఇదికూడా లేకుంటే తన జీవితం, తన పరిస్థితి ఏమై వుండేవో?

''బాబూ, భోజనం వడ్డించెయ్యమంటారా?''


కళ్లు తెరిచాను ఆలోచన్లనుండి తేరుకుని. శాయన్న ప్రక్కన నిలబడి అడుగుతున్నాడు.

''వద్దురా, తర్వాత తింటాను. ముందు ఓ కప్పు టీ ఇవ్వు. స్నానం ముగించి క్షణంలో వచ్చేస్తాను'' అంటూ బాత్‌రూంలోకి దారితీశాను. ఫ్రెష్ అయి వచ్చేసరికి వేడి వేడి టీ పొగలు క్రక్కుతూ నాకోసం ఎదురుచూస్తోంది.

టీ త్రాగ్గానే కొంచెం అలసట తగ్గినట్లనిపించింది.

ప్రాణం తేలిగ్గా అయినట్లనిపించింది.

అప్పటివరకూ ఉన్న అలసట గాలికెగిరిపోయి



మనసంతా ప్రశాంతంగా అయిపోయింది.

టీపాయ్‌మీదున్న న్యూస్ పేపరు, వారపత్రిక నావైపు జాలిగా చూస్తున్నాయి. తమ సంగతికూడా కొంచెం పట్టించుకోమన్నట్లుగా. ముందుగా వారపత్రికను చేతుల్లోకి తీసుకున్నాను. గబగబా పేజీలు తిరగేశాను. ఒకదగ్గర నా కళ్లు మెరిశాయి. 'ప్రియ' వ్రాసిన కథ అందులో వుంది. వెంటనే చదవడం ప్రారంభించాను.

ఆ కథ చదువుతున్నంతసేపూ నన్ను నేను మర్చిపోయానను. పూర్తిగా ఆ కథలో లీనమైపోయాను.

కథ పూర్తయేసరికి మనసంతా భారంగా తయారైంది. ఎందుకో 'ప్రియ' కథల్లో ఎక్కువగా 'ఆర్ద్రత' తొంగిచూస్తూ వుంటుంది. ఆమె కథ చదవగానే ఎవరికైనా గుండె బరువెక్కుతుంది.

ముఖ్యంగా నాకు. కారణం 'ప్రియ' జీవితానికి, ఆమె కథలకు ఎంతో కొంత సబంధం వుండడమే.

ప్రియ నాకు చిన్నప్పటినుండీ తెలుసు. ఆమె పూర్తిపేరు పద్మప్రియ. అందరూ ప్రియ అని పిలుస్తుంటారు. చిన్నతనంలో నేను, ప్రియ, సునీత కలిసి ఆడుకున్న ఆటలు, చెప్పుకున్న కబుర్లు ఇప్పటికీ నా కళ్లముందు సజీవంగా కదలాడుతున్నట్లే వుంటాయి.

సునీత నేను పుట్టిన రెండేళ్లకు పుట్టింది. మా ఇద్దరికీ ఏజ్‌గేప్ ఎక్కువగా లేకపోవడంవల్ల కాబోలు మేమిద్దరం అన్నా చెల్లెళ్లకన్నా స్నేహితుల్లాగే మసలుతుంటాము.

ప్రియావాళ్లు మేముంటున్న ఇంటి ఓనర్లు. బాగా డబ్బు గలవాళ్లు. ప్రియ అల్లారుముద్దుగా పెరిగేదా ఇంట్లో.

అందుకు భిన్నంగా ఆమె అసలు అల్లరికాని, మారాంకాని చేసేదికాదు. ఎప్పుడూ గంభీరంగా కనిపించేది. ఏవో పుస్తకాలు చదువుకుంటూ ఎక్కువగా ఒంటరిగానే గడిపేది. మొదట్లో మాతోనూ కలిసేదికాదు. కాని తర్వాత తర్వాత మాకు బాగా సన్నిహితంగా అయిపోయింది.

ఆమెలోని గంభీరత, అమాయకంగా, స్వచ్ఛంగా కనిపించే ఆమె సౌందర్యం నాకు బాగా నచ్చేవి. అయితే పైకి కనిపించేటంత అమాయకురాలు కాదని, ఆమె ఎంతో తెలివైందనీ తర్వాత అర్థమైంది నాకు.

సునీతా, నేనూ మాత్రం ఎక్కువగా అల్లరి చేసేవాళ్లం.

'ప్రియ' వారించేది మమ్మల్ని అలా అల్లరి చెయ్యొద్దంటూ ఒకరోజు.

సునీత, నేనూ, ప్రియా స్కూలునుండి వస్తుంటే ఒకచోట మామిడితోట కనిపించింది.

వెంటనే నాకూ, సునీతకూ నోరూరింది ఎలాగైనా ఆ మామిడికాయలు కోసుకుతినాలని. ప్రియ మాత్రం ఆ టో ఎవరిదో ఏమో వెళ్లవద్దంది. వేం వినలేదు. మాతోపాటు ప్రియనూ లాక్కెళ్లిపోయాం. కాయలు దొంగచాటుగా కోస్తుంటే తోటమాలి వచ్చేశాడు. సునీత చేతికందినవి దొరకపుచ్చుకుని పారిపోయింది. నేనూ, ప్రియా దొరికిపోయాం.

ఇద్దరిలో కాయలు ఎవరు కోయడానికి ప్రయత్నించారో చెప్పమన్నాడు మాలి. వెంటనే నేనేనంటూ ప్రియ ఒప్పేసుకుంది. నాకు భలే ఆశ్చర్యమనిపించింది. తోటమాలి మా దగ్గర కాయలేవీ కనిపించకపోవడంతో వదిలేశాడు.

త్రోవలో అడిగాను ప్రియను అలా ఎందుకు చెప్పావంటూ

''నేను ఆడపిల్లనుకదా, కనికరించయినా వదిలేస్తాడు. అదే నువ్వయితే నాలుగు తన్నిగాని వదలడు'' అంది అల్లరిగా.

అప్పుడర్థమైంది ఆమె తననుకుంటున్నంత అమాయకురాలుకాదని, ముభావంగా కనిపించే ఆమెలో చాలా భావాలు దాగున్నాయనీను.

నేను చేసిన నేరాన్ని తనపై వేసుకుంది. నాకారోజునుండీ ఆమె అంటే వున్న ఇష్టం రెట్టింపయ్యింది.

ప్రియ ఎప్పుడూ ఏవో పుస్తకాలు చదువుతూ కాలక్షేపం చేసేది. అప్పుడప్పుడు చిన్న చిన్న కథలూ, కవితలూ కూడా వ్రాసేది. నన్ను చదవమని, వాటిపై నా అభిప్రాయం చెప్పమని అడుగుతుండేది. కథలంటే

నాకేమాత్రం ఆసక్తి వుండేదికాదు మొదట్లో. అయితే ప్రియకోసం చదివి బాగున్నాయని చెప్పేవాడ్ని. ఆమె చాలా సంతోషించేది. అలా నాకు తెలియకుండానే కొద్దికొద్దిగా వాటిపై ఆసక్తి పెరిగింది.

చదువులో అందరూ ఫస్టే. నేను నాకిష్టమైన డ్యాక్టరు వృత్తిని ఎన్నుకున్నాను. ప్రియమాత్రం తెలుగు లిటరేచర్‌తో ఎం.ఏ చేసింది.

సునీత పెళ్లిచేసుకుని అత్తవారింటికి వెళ్లిపోయింది. వయసుతోపాటు ఆలోచనలూ పెరగడంవల్ల కాబోలు ప్రియ, నేను ఇదివరకంత చనువుగా మెలగలేకపోయేవాళ్లం.

సునీతకూడా వెళ్లిపోవడంతో నాది ఒంటరి జీవితమే అయిపోయింది. కొంతవరకు చదువు నా ఒంటరితనాన్ని భర్తీ చేయసాగింది.

ప్రియ అప్పుడప్పుడు ఇంటికి వచ్చేది. తన కథలు పత్రికల్లో పడ్డాయంటూ. ఆమెమీదున్న ఇష్టంతో ఆమె కథల్ని జాగ్రత్తగా చదివేవాడ్ని. చక్కగా వ్రాసేది. జీవితాన్ని ఎంతో చదివినట్లుగా లోతుగా వుండేవామె కథలు.

ఆమె కథనుగురించి చర్చిస్తున్నప్పుడు ఆమె ముఖంలో వెల్లివిరుస్తున్న ఆనందాన్ని తదేకంగా గమనించేవాడ్ని.

వయసు తెచ్చిన అందంతో ఆమె నిండుగా, పరిపూర్ణమైన స్త్రీలా కనిపించేది నా కంటికి.

ఆమెలో వచ్చిన ఆ మార్పే మా మధ్య హద్దునేర్పరచింది. ఇదివరకులా ఫ్రీగా మాట్లాడలేకపోతున్నామెతో.

ఆమె నన్నెలా చూస్తోందో నాకు తెలియదుగాని, నేనామెను మనసా వాచా ప్రేమిస్తున్నానన్న విషయం నా శరీరంలోని ప్రతి అణువుకూ తెలుసు.

ఆమె కళ్లు నన్ను స్నేహపూర్వకంగానే పలుకరించేవికాని, ఆ కళ్లలో మరో భావం వెతికినా కనబడేదికాదు.

ఇక ఆమెపట్ల నాకున్న ప్రేమను, ఇష్టాన్ని బహిర్గతం చేయడానికి నాకున్న అవకాశమేదీ!

మా మధ్య అంతస్తుల తేడా వుందన్న కారణం నా ప్రేమను పెదవి దాటి రానీయకుండా చేసింది.

కొన్నాళ్లకు ఒక ప్రైవేటు కంపెనీలోని ఆఫీసర్‌తో ప్రియ పెళ్లి ఘనంగా జరిగిపోయింది.

నా హృదయం బాధగా నిట్టూర్చింది. అప్పటినుండీ నా వృత్తిమీదే మనసు లగ్నం చేయసాగాను. సునీత, ప్రియలు అత్తవారిళ్లకు

## దర్శకుడు నాజర్



తెలుగులో మంచి విలన్‌గా ప్రసిద్ధి పొందిన నటుడు నాజర్. వృత్తిరీత్యా విలన్ పాత్రలు వేస్తున్నా, స్వతహాగా మంచి మనిషి. భేషజం లేకుండా ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతాడు. ఇటీవల కలిసినప్పుడు 'బొంబాయి' చిత్రంలో నాకు చక్కని పాత్ర లభించింది. నాకు మంచి పేరు వచ్చింది. అన్నట్టు మీకు తెలుసో లేదో నటుడుగా నాకున్న అనుభవంతో స్నేహితుల ప్రోత్సాహంతో 'అవతారం' అనే చిత్రానికి దర్శకత్వం చేశాను. కానీ అట్టర్ ఫ్లాప్, కాని నష్టపోయిన ఆ నిర్మాతలను మరలా నేనే ప్రోత్సహించి చక్కని కమర్షియల్ హిట్ చిత్రం ఇవ్వాలన్న ప్రయత్నంలో ఉన్నాను'' అన్నారు నటుడు నాజర్.

సుబ్బారావు

వెళ్లిపోవడంతో ఇక ఒంటరిగా అక్కడ వుండలేక సిటీ వచ్చేసి ప్రాక్టీసు ప్రారంభించాను.

కొన్నాళ్లకే మంచి హస్తవాసి వున్న డాక్టరుగా పేరును, డబ్బును సంపాదించుకోగలిగాను.

మర్నాడు ఆలస్యంగా లేచాను. రాత్రంతా ఆలోచన్లతో గడపడంవల్లనేమో.

నేను తయారై హాస్పిటల్‌కు బయలుదేరుతున్న సమయంలో ''బాబుగారూ మీకు ఉత్తరం'' శాయన్న తెచ్చి అందించాడు. సుపరిచితమైన వ్రాతే... సునీత! కవర్ ఓపెన్ చేశాను.

అన్నయ్యా -

బాగున్నావా? నేను, మీ బావగారుకూడా ఓకే. నీ కాపురం బాగా సాగుతుందని అనుకుంటున్నాను. అలా తెల్లబోకు. ఆసుపత్రే నీకు పెళ్లాం, పిల్లలుకదా! మీ బావగారుకూడా ఎప్పుడూ బిజీనే ఒక్కరోజుకూడా ఇంటిపట్టున వుండరు. నాకిక్కడ పరమబోర్! నేను ఇంత హఠాత్తుగా ఉత్తరం వ్రాయడం ముఖ్యోద్దేశం నిన్నిక్కడకు ఆహ్వానించడం.

ఎప్పుడూ ఆసుపత్రీ, రోగులూ వారి చుట్టూనే తిరగకపోతే అప్పుడప్పుడూ ఎట్లైనా వెళ్లి రావచ్చుకదా! ఎప్పుడూ ఏదో సాకు చెప్పి తప్పించుకుంటున్నావు. ఈసారి మాత్రం నువ్వెలాగైనా వీలు కల్పించుకుని ఇక్కడకు రావలసిందే. నువ్విక్కడకు వస్తే నీకో చిత్రం చూపిస్తాను. అదేమిటో తెలుసుకోవాలంటే వెంటనే బండెక్కెయ్. మీ బావగారుకూడా సెలవుపెడుతున్నారు. రెండురోజులలా ఎట్లైనా తిరిగి వద్దాం. నీ రాకకోసం ఎదురు చూస్తుంటాను. నీ ప్రియమైన సునీత.

ఉత్తరం చదవడంతోపాటే నిర్ణయంకూడా తీసేసుకున్నాను. ఈసారైనా సునీత దగ్గరకు తప్పకుండా వెళ్లాలనీ.

నా నిర్ణయాన్ని వెంటనే అమలు పర్చేశానుకూడా.

సునీత నన్ను చూడగానే ఆనందంగా ఎదురొచ్చింది. ''ఎన్నాళ్లకు మామీద దయకలిగిందంటూ'' నా చెయ్యి పట్టుకుని లోపలకు తీసుకుని వెళ్లింది.

ఇంట్లో... 'ప్రియ' సోఫామీద కూర్చుని పుస్తకం చదువుకుంటోంది. ఆమెను చూడగానే నా గుండె వేగంగా కొట్టుకుంది. ప్రియ ఇక్కడ వుందా? ఇదేనా సునీత తనకు చూపిస్తానన్న వింత. ప్రియ ఇక్కడిలా ప్రత్యక్షం కావడం నాకెంతో సంతోషాని కలుగజేసింది. ప్రియను చూసే అవకాశం కలగజేసినందుకు సునీతకు మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకున్నాను.

నన్ను చూడగానే ప్రియ పలకరింపుగా నవ్వింది. ఆమె ముఖంలో కనిపించీ కనిపించనట్లుగా సన్నని విషాద వీచికలు. ఆమె ముఖం ఎంతో ప్రసన్నంగా వున్నా నాకు మాత్రం ఏదో వెలితి కనిపించింది.

''ప్రియ ఇక్కడే వుందని ఉత్తరంలో వ్రాయలేదేం?'' సునీతవైపు తిరిగి అడిగాను.

''తనే వ్రాయవద్దంది, ఎలాగూ వస్తావుకదా అని''

''విస్మయంగా చూశానో క్షణం ''ఎలా తెలుసు? నేను రాకపోయి వుంటే?''

''నువ్వీసారి ఎలాగైనా వస్తావన్న నమ్మకం తనకుందట'' సునీత చెప్పిన మాటలు నన్నెంతో ఆనందపరిచాయి.

భోజనం చేసిన వెంటనే నిద్ర ముంచుకొచ్చింది. ప్రయాణపు బడలికవల్ల కాబోలు. రేపు మాట్లాడుకోవచ్చు అంటూ నిద్రపోవడానికి గదిలోకెళ్లిపోయాను.

అయితే ప్రియ ఆలోచన్లు నన్ను చుట్టుముట్టి నా నిద్రను దూరంగా తరిమేశాయి.

ప్రియ పెళ్లి చేసుకుని వెళ్లిపోవడంతోనే నాలోని ఉత్సాహమూ హరించిపోయింది. నా ప్రాణమేదో

నన్ను విడిచిపోయినట్లుగా అనిపించింది.

సునీతకు నా మనసు తెలిసినా ఓదార్చే ప్రయత్నం చేయలేకపోయింది.

సునీత తనతో ఒకసారి అందికూడా. 'ప్రియ'కు నీ మనసులోని మాట చెప్పరాదూ? తనేమంటుందో చూద్దాం!''

నేను నవ్వేసి వూరుకున్నాను. ప్రియ మనసేమిటో తెలియకుండా నేను అడగడం నాకెందుకో నచ్చలేదు. పైగా తను కాదంటే భరించగలిగే శక్తి తనకు వుందా?

సునీతకు కూడా తెలుసు, అంతస్తుల తేడా తమ మధ్య దుర్భేద్యమైన గోడలా వుందని, అందుకే తనూ ఇంకేమీ మాట్లాడలేదు.

ప్రియ భర్త అనుకున్నంత మంచివాడు కాదన్న విషయం కొద్దిరోజులకే అర్థమైపోయింది.

అతడు వ్యసనాల పుట్ట. తాగుబోతు, తిరుగుబోతు. 'ప్రియ' అప్పటికే పెద్ద పేరున్న రచయిత్రి. అతనికది కంటగింపుగా వుండేది. అతడి మేన్ ఇగో ఆమె గొప్పతనాన్ని భరించలేకపోయింది.


ఎప్పుడూ ప్రియతో గొడవపడేవాడు. బాగా తాగివచ్చినప్పుడు ప్రియపై చెయ్యి చేసుకునేవాడుకూడా. సౌందర్యం, తెలివితేటలు కలబోసిన ఆ పసిడిబొమ్మకు అలాంటి నీచమైన భర్త దొరకడం ఎంత దురదృష్టం!

అతడొకరోజు ఎవరో ఒకామెను ఇంటికి వెంటబెట్టుకొచ్చాడు. ప్రియ భరించలేకపోయింది. ఇద్దరూ ఘర్షణ పడ్డారు. ప్రియ మరక్కడ వుండలేక ఇంటికి వచ్చేసింది.

ఇక ఆ దౌర్భాగ్యుడితో కాపురం చేయలేనని ఖచ్చితంగా చెప్పేసింది. ఎవరూ ఏమీ అనలేకపోయారు. కొన్నాళ్లకు ఆమె భర్త బాగా తాగి కారునడపడంవల్ల ఏక్సిడెంట్ అయి మరణించాడని తెలిసింది.

ఆ వార్త విన్న ఆమెలో ఏ భావమూ లేదు. ఆమె కళ్లు మాత్రం శూన్యంలోకి చూస్తున్నట్లుగా వుండిపోయాయి కొన్నాళ్లు. ఆ సంఘటన నుండి తేరుకోవడానికి ఆమె చాలా కాలమే పట్టింది. ఆలోచన్లనుండి తేరుకుని బలవంతంగా నిద్రకుపక్రమించాను.

ఉదయం లేవగానే కాఫీ కప్పుడో దర్శనమిచ్చింది ప్రియ. ఆశ్చర్యపోయాను ఆనందంతో.



''ప్రియా! నువ్వు... సునీతేమైంది?''

''తనే తీసుకొస్తుంటే మధ్యలో నేను లాక్కున్నాను''

ఆమె కళ్లలో ఏ భావాన్నీ వెతుక్కోలేకపోయాను.

మొత్తానికి ఆమె అలా నాకోసం కాఫీ తీసుకురావడం నాకెంతో సంతోషమనిపించింది.

పైగా ఉదయం లేచీ లేవగానే ఆమె ముగ్ధమనోహర మోహన రూపం కనిపించినందుకు ఎంతో ఆనందమనిపించింది.

'ఈ రోజంతా ఆహ్లాదంగానూ, ఉల్లాసంగానూ గడుస్తుందేమో' అనుకోకుండా వుండలేకపోయాను.

''కూర్చో ప్రియా!''

తను నాకు దగ్గరగా కుర్చీ లాక్కుని కూర్చుంది.

''ఇప్పుడు చెప్పు. ప్రస్తుతం ఏం చేస్తున్నావు? అదే... ఎలా కాలక్షేపం చేస్తున్నావు?''

''ఏముంది? వున్నాయిగా కథలూ, కాకరకాయలును. అవే నా కాలక్షేపం''

''ఓ! అవునుకదూ! సరే, నీ కథల్లో పాత్రల్ని మరీ అలా ఏడిపించేస్తావేం?''

''అంటే?''

''నీ కథల్లో స్త్రీ పాత్ర వుందంటే ఆమె అష్టకష్టాలు పడవల్సిందే. ఆమెనలా బాధించి, బాధించిగాని వదలవు''

''అది ఆ పాత్ర స్వభావం. ఆ పాత్ర సృష్టి అలా జరుగుతుంది మరి''

''అన్ని పాత్రలు అంతేనా? స్త్రీ అన్ని రంగాల్లోనూ ఎంతో ముందుకెళుతుంటే నీచే సృష్టించబడిన పాత్రలు మాత్రం పాతికేళ్ళు వెనక్కెళ్లిపోయి, పురుషాహంకారానికి బలైపోయి నానా అవస్థలు పడుతుంటాయి. స్త్రీకి స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు సంపూర్ణంగా వున్న ఈ రోజుల్లోకూడా...''

''ఎక్కడున్నాయి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు? అవన్నీ కథల్లోనూ, సినిమాల్లోను. అంతేగాని నిజంగా స్త్రీకి ఈరోజుక్కూడా సంపూర్ణమైన రక్షణ వుందంటావా? మగవాడామెను పురుషాధిక్యతతో అణచడం లేదంటావా? పురుషుడు స్త్రీని ఆటబొమ్మగా ఆడించే స్థితి ఇంకా పూర్తిగా పోలేదనడానికి నిదర్శనాలు ఈనాటి వరకట్నం చావులూ, వ్యభిచార వాటికలూను. అర్ధరాత్రి స్త్రీ ఒంటరిగా రోడ్డుమీదకి పంపగలవా?''

ఆమె ఆవేశంతో అలా అడుగుతుంటే నేనేమీ మాట్లాడలేకపోయాను. ఆమె చెప్పిందాంట్లో నిజం వుంది.

''మీ రచయితలతో మాట్లాడడం కష్టంలే ఎలాగైనా! సరే, ఇన్నిన్ని పేజీలు వ్రాయగలుగుతారు, బోర్ కొట్టదూ?''

''ఉహూ! ఇదీ ఒక రకమైన వ్యసనం లాంటిదే! నిజానికి వ్రాయకపోతేనే బోర్ కొడుతుంది''

''సరిసరి! మేమక్కడ పెద్ద ప్రోగ్రామేసుక్కూర్చుంటే మీరిక్కడ తాపీగా హస్కు కొడ్తున్నారా?'' అంటూ సునీత, ఆమె భర్త వచ్చారు.

''ఇంతకూ ఏమిటి ప్రోగ్రాం?'' అడిగాను.

''మహాబలిపురం! మద్రాసులోనే వుంటున్నా మేం ఇంతవరకూ చూడనే లేదు. ప్రియక్కూడా ఆ ప్రదేశం చూడాలని వుందట. నువ్వు చూసే వుంటావు. అయినా మాతో రాక తప్పదు. ఏమంటావ్?''

''నాకేమాత్రం అభ్యంతరం లేదు''

నేను అరగంటలో అన్ని కార్యక్రమాలూ పూర్తిచేసుకుని రెడీ అయి కూర్చున్నాను.

ఇంతలో ప్రియకూడా తయారై వచ్చింది.

ఆమెను చూసి ఒక్క క్షణం నా గుండె లయ తప్పినట్లయింది.

దివినుండి భువికి దిగివచ్చిన దేవకన్యలా

మెరిసిపోతోంది. అప్సరసల్ని సైతం తలదన్నే అందం ఆమెది అనిపించిందా క్షణంలో. కళ్లతోనే అభినందించాను.

ఆమె చటుక్కున చూపులు త్రిప్పేసుకుంది. నావైపు చూస్తున్నదల్లా.

అందరం సునీత భర్త ఆఫీసు జీపులో మహాబలిపురం చేరాం. ఇంతకు ముందు చూసేసిన ప్రదేశమే అయినా ఈసారి మాత్రం అందరితో ముఖ్యంగా ప్రియతో కలిసి చూస్తున్నందుకు ఇంకా అందంగా కనిపించిందా ప్రదేశం.

ప్రియ మాత్రం అక్కడి శిలలను, శిల్పుల నైపుణ్యతను జాగ్రత్తగా పరిశీలిస్తోంది. ఆమెకా ప్రదేశం ఎంతో నచ్చిందన్న విషయం ఆమె కళ్లలోని మెరుపే చెబుతోంది.

మధ్యాహ్నం మేం తెచ్చుకున్న ఫలహారాలను ఆరగించేసి తిరుగు ప్రయాణం కట్టాం.

తిరుగు ప్రయాణంలో వి.జి.పి. గార్డెన్స్‌కూడా చూద్దామని సునీత బలవంతం చేయడంతో దిగక తప్పిందికాదు.

పెద్దల కంటె పిల్లలకు బాగా నచ్చుతుందా ప్రదేశం. నేనిదివరకు చూసిందే అయినా మళ్లీ ఓసారి చుట్టేశాం.

ఒకచోట సినిమా షూటింగ్ జరుగుతోంది. సునీత షూటింగ్ చూద్దాం అంది. సునీత సినిమాలెక్కువగా చూస్తుంది. సహజంగా యాక్టర్లంటే ఆమెకున్న ఇంట్రస్టువల్ల ఆమె బలవంతంపై అక్కడికెళ్తుంటే ప్రియ మాత్రం తను రాలేనంది.

''ఇక్కడే కూర్చుంటాను, మీరెళ్లిరండి'' అంటూ ఆమె ఒకచోట కూర్చుండిపోయింది.

మేం ముగ్గురం అక్కడికి దారితీశాం.

కొద్దిసేపటికి ఎందుకో ప్రియవైపుచూశాను. నా గుండె ఆగినంత పనైంది. ఒక కుర్రకారు బేచ్ ఆమెను చుట్టేసి వుంది. వడివడిగా అడుగు వేసుకుంటూ అక్కడికి చేరుకున్నాను.

ఆమెను రచయిత్రిగా గుర్తుపట్టినట్లున్నారు. ప్రశ్నలతో ఆమెను వేధిస్తున్నారు. ఆటోగ్రాఫ్‌లడుగుతున్నారు.

''మీ కథలన్నా, మీ నవలలన్నా నాకెంతో ఇష్టం! మీరన్నాకూడా!'' అంటూ ఒకడామె చెయ్యి పట్టుకుని ముద్దు పెట్టేసుకున్నాడు. ఆమె కంపరంగా చూసి విదిలించుకుంది.

## పెళ్లి

''నేనింకెప్పుడూ ఏ అమ్మాయిని పెళ్లిచేసుకోమని అడగను'' అన్నాడు గోవిందం.

''మళ్లీ ఎవరైనా అమ్మాయి కాదందా?''

''కాదు, ఒప్పుకుంది!'' చెప్పాడు గోవిందం.

- పి.వి.మురళీకృష్ణ (హైదరాబాద్)



నేనంతలో అక్కడకు చేరుకుని అతణ్ణి పట్టుకుని వెనక్కు తోసేశాను కోపంతో.

నేనలా చేయడంతో మిగిలిన మూక నామీదకు రాబోయింది. ఇంతలో సునీత, ఆమె భర్త వచ్చి గదమాయించడతో వాళ్లు జారుకున్నారు.

ప్రియ ఆ సంఘటనను తేలిగ్గానే తీసుకుంది. కాని నన్ను మాత్రం ఆ దుస్సంఘటన బాగా కలిచివేసిందనే చెప్పాలి. ఏదో తెలియని బాధ నన్ను ఆవహించి అశాంతికి గురిచేసింది.

ప్రియనెవరైనా అవమానిస్తే నేను భరించలేనని నాకా క్షణంలో మరింత ఎక్కువగా అన్పించసాగింది.

ఆరోజు డైరీలో రాసుకున్నాను.

ప్రియా!

ఈరోజు నేనేమిటో నాకు పూర్తిగా అర్థమైంది. ఆ వెధవ నీ చెయ్యి పట్టుకున్నప్పుడు నేనది భరించలేకపోయాను.

వాడిని చంపేద్దామన్నంత కోపం వచ్చింది.

దానిక్కారణం ఏమిటా అని నన్ను నేను ప్రశ్నించుకుంటే నాకు దొరికిన సమాధానం 'నేను నిన్నింకా ప్రేమిస్తున్నాను' అని.

ఈ విషయం నేను నీకెన్నోసార్లు చెప్పాలనుకున్నాను. కాని ఆ మాట గొంతువరకూ వచ్చి ఆగిపోయేది. పెదవిదాటి రాలేదు. దానిక్కారణం ఏమిటో తెలుసా? నువ్వు కాదంటే భరించే శక్తి ఈ చిన్న గుండెకు లేకపోవడమే. పైగా నీవు కలవారింటిలో పుట్టడం.

నీవు నాకు కాకుండా మరొకరి సొంతం అయిన రోజు నేను పడ్డ బాధ వర్ణనాతీతం.

కానీ ఈరోజు... నువ్వు స్వతంత్రురాలివి. మంచికో, చెడుకో మళ్లీ నీ జీవితం నీ చేతుల్లోకి వచ్చేసింది.

ఇక నేను... నీవు నాకు దక్కలేదన్న స్వార్థమో, నా మనసులో మరొకరికి చోటివ్వలేని అశక్తతో నాకు తెలియదుగాని నేనింకా ఒంటరిగానే వుండిపోయాను.

ఈరోజు నా అంతరంగం ఏమిటో నాకు పూర్తిగా అవగతమైంది. నేను నీ సమక్షాన్ని ఎంతగా కోరుకుంటున్నానో నాకు తెలిసివచ్చింది. నేనిక ఉపేక్షించలేను. ఆ నాడు చేసిన పొరపాటు మళ్లీ చేయలేను.

నా మనసు ఈ రోజు నీవముందు పరచాలనుకుంటున్నాను. నిన్ను నా జీవితంలోనికి మనస్ఫూర్తిగా ఆహ్వానించాలనుకుంటున్నాను. కానీ నీ మనసు లోతును అంచనా వేయడంలో నేను పూర్తిగా ఓడిపోతున్నాను.

నీటముంచినా, పాలముంచినా నీదే భారం! ఇవే మాటల్ని రేపు ప్రియతో చెప్పెయ్యాలి అనుకుంటూ కలతనిద్రపోయాను.

కాని... మర్నాడు 'ప్రియ' ఇంటినుండి ఫోన్ వచ్చింది ప్రియను వెంటనే రమ్మంటూ.

ప్రియ బయలుదేరి వెళ్లిపోయింది.

ఎందుకో ఆమె వెళ్లిపోతోంటే నాకనిపించింది, ఇక ఈ జన్మకు ఆమెకు నా మనసు తెలిసే అవకాశం రాదని.

ఇక అక్కడ వుండలేక సునీత దగ్గర సెలవుతీసుకుని బయలుదేరుతున్న సమయంలో ''అన్నయ్యా ప్రియ నీకీ ఉత్తరం ఇవ్వమంది'' అంటూ ఓ కవరు తెచ్చి ఇచ్చింది. నేను ఆశ్చర్యపోయాను. సునీత ఆటపట్టిస్తుందేమో అనుకున్నాను. కవరు విప్పి చూశాను. నాకు పరిచయమున్న వ్రాతే.

నాకు ప్రియాతి ప్రియమైన ప్రియ వ్రాత అది.

నా కళ్లు ఆ అక్షరాల వెంటే పరుగుతీయనారంభించాయి.

చైతన్యా...

ఇంతసేపూ నీ ప్రక్కనే వుండి అంతలో

మాయమై మళ్లీ ఇలా లెటర్లో దర్శనమిస్తున్నందుకు ఆశ్చర్యంగా వుందికదూ! మొట్టమొదటిసారిగా నీకు ఉత్తరం వ్రాస్తున్నందుకు నాకూ ఇది సరికొత్త అనుభవమే.

నేనిక్కడకు వచ్చిన వెంటనే సునీతద్వారా తెలుసుకున్నదేమిటంటే నువ్వు నన్ను చిన్నతనంనుండి ఇష్టపడుతున్నావని, నన్నెంతో గాఢంగా ప్రేమించావనీను. నేను నమ్మలేకపోయాను.

ఎప్పుడూ మాటల్లోగాని, చేతల్లోగాని నువ్వు నాకీ విషయం తెలయజేయలేదు. నాపట్ల నీకున్నది స్నేహం మాత్రమేనని నేనింతవరకు భావిస్తూ వచ్చాను.

నువ్వు నీ మనసును ఎన్నడూ తెలియజేయకపోవడంవల్ల నీగురించి ఆలోచించే అవకాశం ఒకరకంగా నాకివ్వనట్లే. నీ మనసును నేనైనా గ్రహించనందుకు సిగ్గుపడుతున్నానుకూడా.

అయితే నేనిప్పుడున్న పరిస్థితి వేరు.

నీవింకా నన్ను ప్రేమిస్తున్నావా? ఏమో? నిన్నిక్కడకు రప్పించింది నేనే. అయితే నేను ఈ పరిస్థితిలో పెదవి విప్పటాన్కి అనర్హురాలిని అని ఆలోచిస్తున్న సమయంలో...

సరిగ్గా అప్పుడు జరిగిందా సంఘటన...

ఈరోజు ఉదయమే నీకు కాఫీ ఇవ్వడానికి నీ గదిలోకి వస్తే నీవింకా నిద్రనుండి మేలుకోలేదు. నీకునిద్రాభంగం కలిగించడం ఇష్టంలేక వెనక్కు తిరిగి వెళ్లేంతలో నన్నో వస్తువు ఆకర్షించింది. అది నీ టేబుల్పైనున్న ఓ పుస్తకం!

'నా మనసుకు ప్రతిరూపం' అని అట్టపై వ్రాసి వున్న ఆ పుస్తకం చూడాలన్న కుతూహలంతో దాన్ని అందుకుకుని పేజీలు త్రిప్పాను. అది నీ డైరీ! బహుశా రాత్రి రాయడంవల్ల భద్రపర్చడం మర్చిపోయి వుంటావు. ఇతరుల డైరీలు చదవడం సంస్కారం కాకున్నా నాక్కావలసిన సమాధానం దొరకుతుందేమోనన్న ఆత్రుతతో, నీ మనసేమిటో తెలుసుకోవాలన్న ప్రయత్నంలో... క్షణం తటపటాయించి మరుక్షణం చదవడం మొదలుపెట్టాను.

నీ అంతరంగం అద్దంలా ప్రతిబింబించింది ప్రతిపేజీలోనూ నీ హృదయంలో నాకిప్పటికీ స్థానం వుందని గ్రహించి నేను ఎంతో సంతోషించాను.

నీ డైరీలోని ఆఖరు వాక్యాలు నా శంకను తీర్చేశాయి. ఆ రోజుల్లోనే మొగ్గతొడిగిన నీ ప్రేమ వికసించి నేటికీ సుమ సౌరభాలు వెదజల్లుతోందని తెల్సుకున్నాను.

నీ అడుగులో అడుగు వేయడానికీ, నీ చేయందుకోవడానికీ నేను సిద్ధం.

నీ ప్రియ

వుత్తరం చదివిన నాకు అది కలో, నిజమో ఒక్క క్షణంపాటు అర్థంకాలేదు. ప్రియ తన మనసు తెలుసుకుంది. తనతో జీవితాన్ని పంచుకోవడానికి సిద్ధంగా వుంది. ఓహ్! ఈ ఆనందాన్ని భరించలేకపోతోంది నాకున్న ఈ చిన్నగుండె.

అంతలో... హఠాత్తుగా గుర్తొచ్చింది. రాత్రి తాను డైరీ వ్రాసేసి డెస్కులోపల ఎవరూ చూడకుండా భద్రపర్చినట్లు తనకు బాగా గుర్తు. మరది టేబుల్పైకి మళ్లీ ఎలా వచ్చింది?

సునీత...! అవును, నేను అనుమానంగా చూశాను సునీతవేపు.

సునీత నావైపు చూసి నవ్వుతోంది మర్మగర్భంగా.

అయితే ఆ డైరీని ప్రియకు కన్పించేట్లుగా చేసింది సునీతన్నమాట. తన ప్రేమ సందేశాన్ని ప్రియకు చేర్చిన సునీతకు మనసులోనే కృతజ్ఞతలర్పించుకున్నాను.